ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.8 • కనిష్ఠం 19.6
నిర్మల్ జిల్లా వార్తలు


సోమవారం 11 నవంబరు 2024

నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు
: కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే దృష్ట్యా సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి రద్దు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ అభిలాషఅభినవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి రావద్దని, కుటుంబ సర్వేలో భాగంగా ప్రజలు తమ సమాచారం అందించి సర్వేకు వచ్చే అధికారులకు సహకరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని సూచించారు.



• సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులు (ఫైల్)



• బాసర ట్రిపుల్ ఐటీ ప్రధాన ప్రవేశ ద్వారం

ట్రబుల్స్.. ఐటీ!

» బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థుల అవస్థలు
» ఆందోళన చేపట్టినా.. లభించని పరిష్కారం
» రెండేళ్ల నుంచి నిలిచిపోయిన దుప్పట్లు, పరుపులు, యూనిఫామ్స్ సరఫరా
» హాస్టళ్లలో వసతుల లేమి
» బోధన సిబ్బంది కొరత
» నిధులు రాక ఎక్కడి సమస్యలు అక్కడే..

బాసర, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సాక్షాత్తు చదువుల తల్లి కొలువై ఉన్న బాసర క్షేత్రంలో గల ఆర్జీయూకేటీ విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) సమస్యలకు పెద్ద నిలయంగా మారింది. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ విద్యాసంస్థలో గత కొన్నేళ్ల నుంచి విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పడుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి.. ఇప్పటి వరకు రెగ్యులర్ వైస్ చాన్సలర్ నియామకం జరగలేదు. ఇన్‌చార్జి వీసీలతో యూనివర్సిటీలో పరిస్థితి రోజురోజుకూ దిగజారింది. పాలన కుంటుపడి విద్యా బోధనలో సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల ప్రతిభా ఫలితాలపై ప్రభావం పడుతోందంటున్నారు. సమస్యలను భరించలేక విద్యార్థులు ఆందోళనకు దిగుతున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి పలుమార్లు విద్యార్థులు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. ఇటీవల కూడా విద్యార్థులు భారీ ర్యాలీలు, ధర్నాలు వివిధ డిమాండ్ల పరిష్కారం కోసం పోరాటం చేశారు. ప్రతీసారి యూనివర్సిటీ అధికారులు హామీలివ్వడం.. ఆ తర్వాత వాటిని అమలు పరచకపోవడంతో ఇక్కడ పరిపాటిగా మారింది. ఇటీవలే ఆందోళన చేసిన విద్యార్థులకు హామీలతో ఆందోళనను విరమింపజేశారు. మూడు నుంచి ఐదు వారాల్లో సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని చెప్పారు. హామీలిచ్చి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ.. హామీలు నెరవేరలేదు. ప్రతీసారి సమస్యలు పరిష్కరించకపోగా.. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై రెండేళ్ల క్రిందట నాన్‌బెయిలెబుల్ సెక్షన్‌లతో అధికారులు కేసులు నమోదు చేశారు. చదువు పూర్తయినా.. పోలీసు కేసుల కారణంగా విద్యార్థులు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు పొందలేని దుస్థితి నెలకొంది. ఈక్రమంలో సమస్యల గురించి ప్రశ్నిస్తున్న విద్యార్థులకు కేసుల భయం చూపిస్తున్న అధికారులు.. వాటి పరిష్కారం కోసం మాత్రం చర్యలు చేపట్టడం లేదు.

హామీలు బుట్టదాఖలు

సెప్టెంబరు మొదటి వారంలో విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రతీరోజు విరామ సమయంలో ర్యాలీలు నిర్వహిస్తూ ఆందోళన చేశారు. అధికారులు విద్యార్థులతో చర్చించి ఆందోళనను విరమింపజేశారు. విద్యార్థులు పేర్కొన్న 20 హామీలను ఒకటి నుంచి నాలుగు వారాల్లోగా పరిష్కరిస్తామని, ప్రతీ హామీకి సమయాన్ని కేటాయిస్తూ లిఖిత పూర్వకంగా హామీ పత్రాన్ని విద్యార్థులకు అందజేశారు. దీంతో విద్యార్థులు అధికారుల మాటలు నమ్మి విరమిస్తే.. దాదాపు రెండు నెలలు గడుస్తున్నా.. చిన్నచిన్న ఒకటి, రెండు హామీలు మినహా ఏమీ కూడా పూర్తి చేయలేదు. హాస్టళ్లలో, విద్యాబోధనలో నెలకొన్న సమస్యలు, మెస్సుల్లో భోజన నాణ్యత, ఇతర అవసరాల గురించి విద్యార్థులు అడిగారు. విద్యార్థుల డిమాండ్లు అన్ని కూడా వారికి ప్రధానమైనవే. దాదాపు రెండు నెలలు గడుస్తున్నా.. మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. ఇప్పుడున్న అధికారులైనా విద్యార్థుల సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

ట్రిపుల్ ఐటీలో సమస్యలు ఇవీ..

- పీయూసీ-1 పీయూసీ-2 విద్యార్థులకు కంప్యూటర్ తరగతులు జరుగుతున్నాయి. గత మూడేళ్ల నుంచి లాప్‌టాప్‌లు అందివ్వకపోవడం, డెస్క్‌టాప్ ల్యాబ్‌లు లేకపోవడం వల్ల ప్రాక్టికల్స్ జరగడం లేదు. ఇలాగే విద్యా సంవత్సరాలను పూర్తి చేస్తూ పై చదువులకు వెళ్లిపోతున్నారు.
- హాస్టళ్లలో గత రెండేళ్ల నుండి విద్యార్థులకు అవసరమైన పరుపులు, మంచాలు, దుప్పట్లు, స్పోర్ట్స్, యూనివర్సిటీ యూనిఫామ్స్ అందివ్వడం లేదు. కనీసం క్రీడా పరికరాల కోసం విద్యార్థులు ఆందోళనకు దిగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.
- యూనివర్సిటీలో కేవలం 18 మంది మాత్రమే శాశ్వత ప్రొఫెసర్‌లు ఉన్నారు. మిగితా వారంతా కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీలే. వీరిలో ఇటీవల 50 మంది వరకు జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ లెక్చరర్స్ ప్రభుత్వ ఉద్యోగాలు పొంది వెళ్లిపోయారు. సుమారు 150 అధ్యాపక పోస్టులు పదేళ్ల నుంచి ఖాళీగా ఉన్నాయి.
- యూనివర్సిటీలో ఉన్న ఆసుపత్రిలో మెరుగైన వసతులు అందుబాటులో లేవు. ఎంబీబీఎస్ చదివిన డాక్టర్లు ఉన్నప్పటికీ.. ప్రాథమిక చికిత్సలు తప్ప అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోవాల్సి వస్తుంది. 9వేల మంది విద్యార్థుల్లో ఆరున్నర వేల మంది బాలికలు ఉన్నారు. రెండేళ్ల నుంచి మహిళా వైద్య నిపుణురాలు కావాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.
- గత రెండేళ్లలో 10 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యల కట్టడికి, అందుకు దారి తీసిన లోపాలపై అధికారులు చర్యలు చేపట్టడం లేదు.
- యూనివర్సిటీలో ఉన్న మూడు మెస్ కాంట్రాక్టర్ల గడువు మూడేళ్ల కిందటే ముగిసింది. ఫుడ్ పాయిజన్ జరిగినా, భోజనంలో పురుగులు, ఇతర కీటకాలు వచ్చినా.. అధికారులు ఇంకా వారినే కొనసాగిస్తున్నారు. విద్యార్థులు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతుంది.



• విద్యార్థుల డిమాండ్లపై లిఖిత పూర్వకంగా హామీ పత్రాన్ని అందజేస్తున్న అప్పటి వైస్ చాన్సలర్ వెంకటరమణ (ఫైల్)


• బాసరలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్

విద్యతోనే భవిష్యత్తు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై

తానూర్, నవంబరు 10 : మన భవిష్యత్తు మంచి విద్య ద్వారానే బాగుపడుతుందని ఎస్సై రమేష్ అన్నారు. మండలంలోని బోసి గ్రామంలోని బాయ్స్ హాస్టల్‌లో ఆదివారం నిర్వహించిన మోటివేషన్ వ్యక్తిత్వ వికాసం , కేరీర్ గైడెన్స్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తు కోసం కష్టపడి చదవాలని సూచించారు. ఎంత కష్టమైనా ఇష్టంగా చదవాలన్నారు. అప్పుడు మనం చదివిన చదువు మనకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వచ్చే పదోతరగతి పరీక్షలు విద్యార్థులు పదికి పది జీపీఏ సాధించే విధంగా కష్టపడాలని సూచించారు. ప్రతి ఒక్కరు చట్టాలపై, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని, తల్లిదండ్రులకు అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ వాడేకర్ లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యసాధనకు నిరంతరం కృషిచేసి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలన్నారు. చెడువ్యసనాలకు లోను కాకుండా సన్మార్గంలో నడవాలని, ఉన్నత శిఖరాలను అదిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అధికారి శ్రీనివాస్, హాస్టల్ వార్డెన్ కవిత, మోటివేషనల్ స్పీకర్లు, ఎంపీడీవో శ్రీనివాస్, ఉపాధ్యాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

దిలావర్‌పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన దిలావర్‌పూర్ మండలం బన్సపల్లిలో జరిగింది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం... బన్సపల్లి గ్రామానికి చెందిన మస్త సంతోష్(37)కు లోకేశ్వరం మం డలం మన్మద్ గ్రామానికి చెందిన స్వప్నతో నాలుగు సంవత్సరాల క్రితం వివా హమైంది. వీరికి రెండు సంవత్సరాల బాబు ఉన్నాడు. అయితే కుటుంబంలో తలెత్తిన గొడవల కారణంగా స్వప్న తన పుట్టింటికి కొడుకును తీసుకుని వెళ్లి పోయింది. తిరిగి స్వప్న రాకపోవడంతో మానసికంగా కుంగిపోయిన సంతోష్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 2వ తేదీన మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన సంతోష్ ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం జీవీ ప్రభాకర్ రెడ్డి పంట పొలంలో సంతోష్ మృతదేహం లభ్యమైంది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమి త్తం నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంతోష్ తండ్రి జయరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

అడెల్లిలో మొక్కులు తీర్చుకున్న భక్తులు

సారంగాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు మొక్కలను తీర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజ రై మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారికి పెరుగన్నంను నైవేద్యంగా సమ ర్పించి కానుకలను హుండీలలో వేశారు. భక్తులు జాతకాన్ని సరిచూసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండడానికి ఆలయ ఇన్‌చార్జి ఈవో రమేష్ అన్ని చర్యలు చేపట్టారు.


అమ్మవారికి మొక్కులను మొక్కుతున్న భక్తులు

తప్పిదాలు లేకుండా సర్వే చేయండి


• కలెక్టర్ అభిలాష అభినవ్
ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


సర్వే పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నిర్మల్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను అను సరిస్తూ ఇంటింటి కుటుంబ సర్వేలో సమగ్ర సమాచారాన్ని సేకరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ పట్టణంలోని వెంకటాద్రిపేట్ వార్డు నెంబర్ 6లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరిస్తున్న తీరును, నిర్ణీత ఫారా లతో ఆయా కోడ్‌ల వారీగా వివరాలు నమో దుచేస్తున్న విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సామా జిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల గణన కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే గ్రామ పంచాయతీలతో పాటు నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ పట్టణాలో సజావుగా సాగుతోందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నివాస గృహాలను ఎన్యుమ రేషన్ బ్లాక్‌లుగా విభజించడం జరిగిందని, ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు సర్వే నిర్వహించాల్సిన తీరుపై శిక్షణ తరగతుల ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించామన్నారు. సమగ్ర సర్వేను ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా జిల్లాలో సమగ్ర ఇంటింటి సర్వే కొనసాగుతోందని, ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని డేటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా అవసరమైన చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్వో రత్న కళ్యాణి, అధికారులు, ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

● 57 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలిసిన పూర్వ విద్యార్థులు


హాజరైన పూర్వవిద్యార్థులు

నిర్మల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని ప్రభుత్వ హైయర్ సెకండరీ పాఠశాలలో 1966-67 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్మల్‌లో ఘనంగా జరిగింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 57 ఏళ్ల తర్వాత ఆ మిత్ర బృందం అంతా ఒకే వేదికపై కలిసింది. దీంతో తమ చిన్న నాటి మిత్రులను కనులారా చూస్తూ... ఆప్యాయంగా పలకరిస్తూ... బాగోగులు తెలుసుకుంటూ... సాగింది పూర్వవిద్యార్థుల సమ్మేళనం.. ఆనాటి మధురానుభూతులను తలచుకున్నారు. అపూర్వకలయికకు నిర్మల్‌లోని ఏఎన్ రెడ్డి కాలనీ క్లబ్ హౌస్ వేదికగా నిలిచింది. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మురళీధర్ రెడ్డి, నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ శంకర్, లింబగిరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ వర్తింపచేసేందుకు కృషి : ముథోల్ ఎమ్మెల్యే

భైంసా, నవంబరు 10 : వివిధ అనారోగ్య కారణాలతో మహారాష్ట్రలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న తెలంగాణ బాధితకుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వర్తింప చేసేందుకు కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని వివిధ గ్రామాల వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణవాసులకు ఇక్కడి రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొందితేనే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తెలంగాణ ప్రాంతవాసులు మహారాష్ట్రలోని ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొందితే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు వీలు లేకుండా ఉందన్నారు. నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి నిత్యం ఎందరో మంది మహారాష్ట్రలోని నాందేడ్, యావత్‌మల్, ముంబాయి, నాగ్‌పూర్ తదితర ప్రాంతాలకు వెళ్లి చికిత్సలు పొందుతున్నారని వివరించారు. మహారాష్ట్రలో చికిత్సలు నిర్వహింపచేసుకున్న బాధిత కుటుంబాలకు సైతం సీఎం రిలీఫ్ ఫండ్ అందింప చేసేందుకు గాను కృషి చేస్తానని స్పష్టం చేశారు. సంబంధిత సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపచేసేందుకు అంకితభావంతో వ్యవహరిస్తానని వెల్లడించారు. ఈ సందర్భగా ముథోల్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.


చెక్కు పంపిణీ చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే

సంక్షిప్త సమాచారం

చేప పిల్లల పంపిణీ


చేప పిల్లలను పంపిణీ చేస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మం డల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాల యం లో ఆదివారం చేపపిల్లలను పంపిణీ చేశారు. ఆరు సొసైటీలు ఒక జీపీ కలిపి చేప పిల్లలను పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా ఫీల్డ్ మెన్ గయాసొద్దీన్ మాట్లా డుతూ... మండలంలోని సొసైటీలకు ఒక జీపీకి కలిపి 4,71,750 చేపపిల్లలను పంపిణీ చేశామన్నారు. కార్య క్రమంలో లబ్ధిదారులు బోరిగాం పెద్దసాయన్న, గంగా తల భీమేష్, దూసముడి నాగేష్, గాడి గంగారాం, నెం బర్ సాయన్న, బోరింగ్ నడిపి సాయన్న, గాడి నడిపి ఆశన్నలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి
సమావేశం వాయిదా

భైంసా, నవంబరు 10 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో ఈ నెల 14న నిర్వహించతలపెట్టిన నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం వాయిదా వేసినట్లుగా ఆ పార్టీ ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ తెలిపారు. ఆదివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. మహారాష్ట్ర ఎన్నికలతో పాటు పలు అనివార్య కారణాల మూలంగా పార్టీ సమావేశం వాయిదా పడ్డట్లుగా వివరించారు. మహారాష్ట్రలో ఎన్నికల ప్రక్రియ ముగిసిన పిదప సమావేశం నిర్వహించే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ శ్రేణులన్నీ సమావేశం వాయిదా వేసి విషయాన్ని గుర్తుంచుకొని సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

పెంబి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మందపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పెంబి మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన నేమ్మల వినోద్(17)కు చిన్నప్పటి నుంచి మానసిక పరిస్థితి సరిగా లేదు. ఊరిలో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తూ కాలం నడుపుతున్నాడు. ఇటీవల ఎటువంటి పని చేయకపోవడంతో డిప్రెషన్‌కి లోనై శుక్రవారం తన వ్యవసాయ పొలంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారని చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడన్నారు. మృతుడి తల్లి చిలకవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు పెన్షనర్ల సమావేశం

నిర్మల్ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల సంఘ భవనంలో సోమవారం ఉదయం 11 గంటలకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్టు జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల సమాఖ్య న్యూఢిల్లీ సెక్రటరీ జనరల్ డి.సుధాకర్, మహిళా ప్రతినిధి ఉమారెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఆదాయ పన్ను, నగదు రహిత వైద్య సదుపాయం, తదితర సమస్యలపై చర్చిస్తారని అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొ నాలని కోరారు.

సమగ్ర సర్వే పకడ్బందీగా చేపట్టండి

● జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

తలమడుగు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్యామల దేవి కోరారు. ఆదివారం మండలంలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి పథకాలను అందించేందుకు నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు ప్రతి ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. సర్వేలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ రాజమోహన్, ఎంఈవో వెంకట్రావ్ పాల్గొన్నారు


హస్నాపూర్‌లో వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో

వారి వారి విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా సభ్యుల పూర్తి వివరాలను సేకరించేలా చూడాలని సూచించారు. వివరాలు చెప్పే సమయంలో సంబంధిత కుటుంబ సభ్యులకు పలు సూచనలు అందించాలని ఆదేశించారు.

పకడ్బందీగా సర్వే..

నార్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆదివారం మండల కేంద్రంలో ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్లు వెళ్లి పకడ్బందీగా సర్వేని నిర్వహిస్తున్నారు. కుటుంబ యజమాని పూర్తి వివరాలు సేకరిం చి వాటిని సర్వే పారంలో నమోదు చేస్తున్నారు. తప్పులు లేకుండా అన్ని ధృవపత్రాలు వాస్తవలను పూర్తిగా పరిశీలన అనంతరం కుటుంబ వివరాలు తెలుసుకున్నతర్వాతనే నమోదు ప్రక్రియ చేయడం జరుగుతుందని సూపరింటెండెంట్ గంగా సింగ్ తెలిపారు. మండల ప్రజలు ఎలాంటి ఇబ్బంది పడవద్దని, మీ ఇంటి దగ్గర ఎన్యు మరేటర్లు వచ్చి పూర్తి వివరాలు సర్వే ఫారంలో రాస్తారన్నారు. ఎలాంటి సందేహం ఉన్న మమ్మ ల్ని సంప్రదించాలని సూపరింటెండెంట్ గంగా సింగ్ ఈ ప్రాంత ప్రజలను కోరారు.

జాగ్రత్త రాయాలి...

నార్నూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్రకుటుంబ సర్వే ఫారంలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్త రాయాలని నార్నూర్ తహసీల్దార్ రాజాలింగు అన్నారు. ఆదివారం మండలంలోని చోర్గావ్ కంపూర్ గుండాల మహాగావ్ తదితర గ్రామాల్లో పర్యటించి ఎన్యుమరేటర్లకు సలహా, సూచనలు ఇచ్చారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంమ యజమానిని సంప్రదించి వారు ఇచ్చిన ధృవపత్రాలు సరిగా చూసి ఎలాంటి తప్పులు లేకుండా సర్వే ఫారంలో నింపాలని వారికి సూచించారు. వారి వెంట అధికారులు, కార్యదర్శి కసిరాం,రికార్డు అసిస్టెంట్ జిల్లాపెల్లి రమేష్, గ్రామ ప్రజలున్నారు.


కుటుంబ సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామల దేవి

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేను పకడ్బంధీగా చేపట్టాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పలు వార్డుల్లో ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వేను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. పార్మాట్‌లో పేర్కొన్న అంశాలను పూర్తిగా కుటుంబసభ్యుల నుంచి సేకరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. నిర్ణీత గడువు లోగా సర్వే పూర్తి చేయాల్సిన అవసరముందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమా ర్, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో సుమేర్ అహ్మద్ ఖాన్, మేజర్ గ్రామపం చాయతీ ఈవో సంజీవ్ రావు ఉన్నారు.

గుడిహత్నూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన సర్వేను మండల ప్రజలందరూ స్వాగ తించి అధికారులకు సహక రించాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్య క్షులు రాజేశ్వర్ మహారాజ్ పిలుపునిచ్చారు. ఆది వారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణన సర్వే భారత రాజ్యాంగ మూల సిద్ధాంతంపై ఆధారపడి ఉందన్నారు. కులగణన సర్వే రిపోర్టులను ప్రభుత్వం సర్వే పూర్తి అయిన వెంటనే రాష్ట్రంలోని రాజకీయ వాటాని, ఆర్థిక సంపదలో భాగస్వామ్యాన్ని, సామాజిక న్యాయాన్ని 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ ఎస్టీ అణగారిన ప్రజ లందరికీ సమానంగా పంపిణీ చేయాలని ఆయ న డిమాండ్ చేశారు.


సర్వేను పరిశీలిస్తున్న ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్

తప్పులు లేకుండా సర్వే చేయాలి

● ఎంపీడీవో మోహన్‌రెడ్డి

తాంసి: కుటుంబ సర్వేను సంబంధిత సిబ్బంది తప్పులు లేకుండా చేయాలని ఎంపీడీవో మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పొన్నారి, హస్నాపూర్, వడ్డాడి గ్రామాలలో సర్వేపై పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ఎలా వివరాలు సేకరిస్తున్నారో కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది

పలు కార్యాలయాల ఎత్తివేత!

(6వ పేజీ తరువాయి...)

అభివృద్ధి చేసి కొత్తగా డిపో మేనేజర్‌ను నియమించి కొన్ని కొత్త బస్సులను ఏర్పాటు చేసి ఏజెన్సీలోని గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడిపించడం ద్వారా డిపో ప్రయోజనం మెరుగుపరచాలని గిరిజన ప్రాంతాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి ఎత్తివేసిన కార్యాల యాలను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా ప్రభుత్వం పునరుద్ధరించాలి

- కందుకూరి రమేష్, రైతు, నాగాపూర్

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో కార్యాలయాలు పునరుద్ధరించాలి. కార్యాలయాలు ఎత్తి వేయడంతో రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇరిగేషన్ కార్యాలయంతో పాటు, ఆర్టీసీ డిపోలో కూడా రెగ్యూలర్ డీఎంను నియమించి అదనపు బస్సులను ఏర్పాటు చేయాలి.

ఇచ్చోడకు తరలించారు

- రాథోడ్ గణేష్, మండల వ్యవసాయ అధికారి

ఉట్నూర్‌లోని ఏడీఏ కార్యాలయాన్ని ఎన్నికలకు ముందే అప్పటి ప్రభుత్వం ఏడీఏ కార్యాలయాన్ని ఇచ్చోడకు తరలించింది. ప్రజలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడంతో అధికారాలు లేకుండా ఇన్‌చార్జీని మాత్రం ఇచ్చారు. ఉట్నూర్‌లోని ఏడీఏ కార్యాల యంలో రెగ్యూలర్ అధికారిని నియమిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉట్నూర్‌లో కలుసుకున్న పూర్వవిద్యార్థులు

ఉట్నూర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చదువుకున్న బడిని, కన్న ఊరును మరిచిపోవద్దని బావిస్తున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ద్వారా ఆదివారం కలుసుకున్నారు. ఉట్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-2002 మధ్య పదవ తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యా ర్థులు ఆదివారం ఏర్పాటు చేసుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో తమకు చదు వులు చెప్పిన ఉపాధ్యాయులను, ఆ రోజులలో తమకు సేవలు అందించిన నాల్గవ తరగతి ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాము విద్యనేర్పిన విద్యార్థులు అందరు మంచి ప్రవర్తన కలిగి సంఘంలో గుర్తింపు స్థాయిలో ఉండడం ఆనందకరమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని తమ స్థితిగతులను తాము చేస్తున్న ఉద్యోగాల విషయాలను పంచు కున్నారు. 22 ఏళ్ల అనంతరం కలుసుకోవడం ఆనందంగా ఉందని వారు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

మత్తడి వాగులో దూకి ఒకరి ఆత్మహత్య

తలమడుగు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి గ్రామ సమీపంలో గల మత్తడి వాగులో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన రూపేనా నాగన్న (40) అనే యువకుడు మత్తడి వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో జాలర్ల సహాయంతో మృత దేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు త రలించారు. కాగా మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని ఎస్సై అంజమ్మ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబసభ్యుల పరామర్శ

సిరికొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి):సిరికొండ మండలంలోని పొన్న గ్రామం మాజీ సర్పంచ్ శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గొడెం నగేష్ ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆయన వెంట తాంసీ మాజీ జడ్పీటీసీ రాజు, కాగ్నే మాణిక్‌రావ్, డా.మారుతి, ఇంగోలే మాధవ్, రవీంద్రచారి, స్వామి, కృష్ణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

నిర్మల్ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రజక ఉద్యోగ సంఘ సంక్షేమ సంఘం సోమవారం నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులను సన్మానించింది. అధ్యక్షుడు డాక్టర్ గజ్జారాం, భూమన్న, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కుర్చీల అందజేత

ఖానాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ గ్రంథాలయానికి పూర్వపాఠకులు 20 స్టడీ ఛైర్స్‌ను ఆదివారం విరాళంగా అందజేశారు. గ్రంథాలయంలో చదువుకొని ఇటీవల ఉద్యోగం సాధించిన సిహెచ్. సాయి, డి.సాయి కృష్ణ, లావణ్య, నవీన్, సుజాత, తిరుమలేష్, విజయ్ అనే ఏడుగురు ప్రభుత్వ ఉద్యోగులు తాము చదువుకున్న గ్రంథాలయంలో ఇతర అభ్యర్థులకు ఉపయోగపడేలా స్టడీ ఛైర్స్‌ను అందజేశారు. తమ భవిష్యత్తుకు బాటలు వేసిన గ్రంథాలయాన్ని తాము ఎన్నటికీ మరువబోమని భవిష్యత్తులో సైతం గ్రంథాలయంలో కావలసిన సదుపాయాల కల్పనకు తమవంతుగా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ పృథ్వీతో పాటు పాఠకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

● తహసీల్దార్ రాజమోహన్


తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రాజమోహన్

తలమడుగు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహించామన్నారు. మండలంలో ఆయా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు కేంద్రాల వద్ద రెండు రోజుల్లో దాదాపు 200 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అదే విధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు గ్రామాల్లో గల బీఎల్‌వోలను సంప్రదించాలని సూచించారు. అనంతరం బరంపూర్, అర్లి(కె), సుంకిడి, మదనాపూర్, నర్సాపూర్, లక్ష్మంపూర్ తదితర గ్రామాల్లో బీఎల్‌వో కేంద్రాలను తనిఖీ చేసి పరిశీలించారు. ప్రతి ఒక్కరూ పకడ్బందీగా ఓటరును నమోదును చేపట్టాలని సూచించారు.

విద్యార్థులను గుర్తించిన పోలీసులు

నర్సాపూర్(జి), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పారిపోయి బస్టాండ్ వద్దకు వెళ్లారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా డయల్ 100 సిబ్బంది చౌహాన్ కృష్ణ, శ్రీనివాస్ పిల్లలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులకు అప్పగించారు.

సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి

● అడిషనల్ డీఆర్డీఏ పీడీ గంగన్న

తలమడుగు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ అభివృద్ధి పథకాలను అందించేందుకు కృషి చేస్తానని అడిషనల్ డీఆర్డీఏ పీడీ గంగన్న అన్నారు. ఆదివారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాటా ్లడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు కృషి చేస్తానన్నారు. కాగా రుయ్యాడి గ్రామానికి చెందిన బిట్ల గంగన్న అడిషనల్ డీఆర్డీఏగా పదోన్నతి పొందిన సందర్భంగా మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గోక సంజీవ్‌రెడ్డి, గోక ప్రకాష్‌రెడ్డి, గాజుల సాంబశివ్, గోనెల గంగన్న, పురుషోత్తంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పీడీని సన్మానిస్తున్న మాజీ జడ్పీటీసీ గణేష్‌రెడ్డి, గ్రామస్తులు

క్రికెట్ టోర్నీ ప్రారంభించిన ఎంపీ


టోర్నమెంటును రిబ్బన్ కట్‌చేసి ప్రాంభిస్తున్న ఎంపీ

బజార్‌హత్నూర్, నవంబర్ 10: మండలం పరిధిలోని జాతర్ల గ్రామంలోని మైదానంలో బీపీఎల్ క్రికెట్ టోర్నమెంటును ఆదివారం ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గోడం నగేష్ ప్రాంభించారు. క్రికెట్ మైదానంలో ఆరు బంతులను ఆడి యువతను ఉత్సాహతలు ఊగించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు యువతలో దాగి ఉన్నా శక్తి సామర్థ్యాలను వెళికి తీసేందుకు దోహదపడుతాయన్నారు. ఒక టీమ్‌గా ఏర్పడి అందరూ కలిసి శ్రమిస్తే విజయం మీ సొంతం అవుతుందన్నారు. ప్రతి సంవత్సరం ఈ సమయంలో మండలం పరిధిలో క్రికెట్ టోర్నమెంటును నిర్వహిస్తున్న టీమ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం యువత స్మార్ట్ ఫోన్‌లకు బానిసలుగా తయారవుతున్న తరుణంలో ఇటువంటి సాంప్రదాయకమైన ఆటలు ఆడేవిధంగా చేస్తున్న సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో బిజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ కొత్త శంకర్, ఎంపీటీసీ తేలి నారాయణ, పీఏసీఎస్ ఛైర్మన్ మేకల వెంకన్న, నాణెం రమణ, అల్కె గణేష్, సుఖ్‌దేవ్, వినాయక్, బోజారెడ్డి టోర్నమెంటు నిర్వాహక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన


కొనసాగుతున్న వైద్యశిబిరం

లక్ష్మణచాంద, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ఆదివారం భారీ స్పందన లభించింది. గ్రామానికి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, మాజీ డిప్యూటీ స్పీకర్ దివంగత అయిండ్ల భీమ్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమార్తె అయిండ్ల స్వర్ణ రెడ్డి, కుమారుడు అయిండ్ల భూపాల్ రెడ్డిలు నిర్వహించిన ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి మునిపెల్లి గ్రామానికి చెందిన పేషెంట్లతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలైన మల్లాపూర్, మాచాపూర్, పారొపెల్లి, ధర్మారం, చామన్‌పెల్లి, చింతల్‌చందా తదితర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. గ్రామస్తులు ఆసుపత్రి వర్గాల సమాచారం ప్రకారం ఎముకలు, కీళ్ల వ్యాధులకు సంబంధించి 180 మంది, సాధారణ వ్యాధులకు సంబంధించి 210 మంది, చిన్న పిల్లల వ్యాధులకు సంబంధించి 85 మంది, హృదయ సంబంధ వ్యాధులకు సంబంధించి 170 మంది, స్త్రీ సంబంధ వ్యాధులకు సంబంధించి 220 చొప్పున మొత్తం 865 మంది ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ప్రముఖ వైద్య నిపుణులు ప్రమోద్ చంద్రా రెడ్డి, రవీందర్, శశాంక్ రెడ్డి, మానస, వసు కుమార్, కిరష్, అన్వేష్, గిరీష్, గ్రామస్తులు కమల్‌కోట వెంకట్ రెడ్డి, రాంపెల్లి రమేష్, షేరు రాజు, మేడిపెల్లి గంగాధర్, అయిండ్ల వినోద్, గురాల లింగారెడ్డి, దొడ హరీష్ రెడ్డి ఏ. రాజు, బొడ్డు నరేష్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

బాధితులకు పరామర్శ

నేరడిగొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద బుగ్గారం గ్రామానికి చెందిన కారోబారి జాదవ్‌రాందాస్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆదివారం వారిని పరామర్శించి ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేరడిగొండ ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడి ప్రతి రోజు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం రిపోర్టర్ నారాయణ భార్య శస్త్రచికిత్స తీసుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంగా వారింట మాట్లాడి ఆరోగ్య క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

పుస్తకాల అందజేత

బోథ్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సోనాల గ్రామంలో పాఠశాల విద్యార్థుల కోసం గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.సంతోష్‌కుమార్ వివిధ రకాల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ కోసం ఉపయోగపడే పుస్తకాలను అందించినట్లయితే విద్యార్థులకు ఉపయోగపడతాయన్నారు. అంతేగాక పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఈ పుస్తకాలు ఎంతోగానో ఉపకరిస్తాయన్నారు.

ఘనంగా రైతు నాగలి విగ్రహ ఆవిష్కరణ

ఖానాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్‌లో మున్నూరు కాపు కులస్తులు కదం తొక్కారు. ఉమ్మడి జిల్లా లోని మొట్టమొదటి సారిగా తిమ్మాపూర్ (ఖానాపూర్) సంఘం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన రైతు నాగలి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మున్నూరు కాపు కులస్తులు భారీగా హాజరయ్యారు. ఎన్టీఆర్ చౌక్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో మున్నూరు కాపు కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి విగ్రహ దాత ఎమ్మెల్సీ దండే విఠల్, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ మంత్రి జోగు రామన్న, నిర్మల్ మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ రాజూర సత్యం సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ర్యాలీ అనంతరం స్థానిక మున్నూరు కాపు సంఘ భవనం స్వాగత తోరణం ఎదురుగా నిర్మల్ - ఖానాపూర్ రహదారిపై ఏర్పాటు చేసిన రైతు నాగలి విగ్రహాన్ని దాత ఎమ్మెల్సీ దండే విఠల్, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ మంత్రి జోగు రామన్నలు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మున్నూరు కాపు కులస్తులను ఉద్దేశించి పలువురు నేతలు ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో మున్నూరు కాపు కులస్తుల ఐక్యవేదిక ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేద్దామని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్నూరు కాపులు ఐక్యత చాటాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మున్నూరు కాపుల ఎన్నో ఏళ్ల కల మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 50 కోట్ల నిధులను కేటాయించడం అభినందనీయమన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యేగా తనను గెలిపించడంలో మున్నూరు కాపుల పాత్ర ఎంతో కీలకమైందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. రైతు నాగలి విగ్రహ ఏర్పాటుతో మున్నూరు కాపుల ఐక్యత చాటా లనే ఆలోచన అభినందనీయం అన్నారు.రాష్ట్రంలో ఒక్క శాతం ఉన్న అగ్రవర్ణాలు పెత్తనం చేస్తున్నారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. రాష్ట్రంలో మున్నూరు కాపులంతా ఐక్యంగా ఉండాలన్నారు. ఒక్కశాతం ఉన్న అగ్రవర్ణాలు పేరు చివరన తోకలు ఏర్పాటు చేసుకుని వారిని వారు గుర్తించుకుంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన గ్రామాల కుల సంఘాల అధ్యక్షులు పలువురు మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న మున్నూరు కాపు కులస్తులు

నేటి కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

జైనథ్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో రైతు రుణమాఫీ, పంటల తేమ శాతం పెంచాలని సోమవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని జైనథ్ మాజీ ఎంపీపీ ఎం.గోవర్ధన్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలకేంద్రమైన జైనథ్ మార్కెట్ ఆవరణలో మార్క్‌ఫెడ్ ద్వారా చేపడుతున్న సోయాబీన్ కొనుగోళ్లను నాయకులతో కలిసి పరిశీలంచారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఎం.గోవర్ధన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రైతులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రూ.రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఎకరానికి రూ.15వేల చొప్పున వెంటనే రైతుబ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. సోయాబీన్ తేమ శాతం 12 నుంచి 20శాతానికి పెంచి కొనుగోలు చేయడంతో పాటు రైతులకు డబ్బులు చెల్లించాలన్నారు.

మహారాష్ట్రలో ఎన్నికలతో
కూలీలకు డిమాండ్

- ప్రచారంలో పాల్గొంటున్న అక్కడి కూలీలు
- స్థానికంగా వ్యవసాయ పనులకు కూలీలు దొరకక ఇబ్బందులు



బోథ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పొరుగునున్న మహారాష్ట్రలో ఎన్నికలు జరుగుతుండటంతో బోథ్ మండలంలో కూలీల కొరత ఏర్పడింది. వ్యవసాయ పనులకు ఈ ప్రాంత రైతులు మహారాష్ట్ర కూలీలపైన ఆధారపడి ఉన్నారు. అయితే మహారాష్ట్రలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల కారణంగా స్థానికంగా కూలీల కొరత ఏర్పడింది. కూలీ పని కోసం వచ్చే వారంతా మహారాష్ట్రలో రోజుకు రూ.1200 చొప్పున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. దీంతో కూలీలు లేక వ్యవసాయ పనులు నిలిచి పోతున్నాయి.

● ఎన్నికల తరువాత వస్తాం

పత్తి పంట ఏరేందుకు ప్రస్తుతం కూలీలు పెద్ద సంఖ్యలో అవసరం ఉంది. స్థానికంగా కూలీలు లేకపోవడంతో ప్రతి పనికి మహారాష్ట్ర కూలీలే అవసరమవుతున్నారు. అయితే స్థానికంగా ఉన్న రైతులు మహారాష్ట్ర కూలీలను పని కోసం రావాల్సిందిగా అడిగితే తాము ఎన్నికల తరువాత వస్తామని అంటున్నారని స్థానిక రైతులు చెప్తున్నారు. అక్కడ ఎన్నికల ప్రచారంలో రోజుకు రూ.1200 చొప్పున ఇవ్వడంతో పాటు ఆటో ఒక్కంటికి రూ.1800 ప్రచారంలో పాల్గొనేందుకు ఇస్తున్నారు. దీంతో కూలీలు రాక రైతులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

● మహారాష్ట్ర కూలీలు రాక కూలీలకు పెరిగిన డిమాండ్

ఎన్నికల ప్రచారంలో కూలీలు తిరుగుతుంటే స్థానికంగా ఉన్న కూలీలకు డిమాండ్ పెరిగింది. అడిగినంత ఇస్తేనే వస్తామని అంటున్నారు. కిలో పత్తి ఏరితే మహారాష్ట్ర కూలీలకు తొమ్మిది, పది రూపాయలు చొప్పున ఇచ్చేవారు. అయితే స్థానిక కూలీలు కిలో పత్తికి వెళితే రూ.12 డిమాండ్ చేస్తున్నారు. అసలే పంట పెట్టుబడులు పెట్టి సరైన దిగుబడి లేక రైతులు సతమతమవుతుంటే కూలీల భారంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఏది ఏమైనా మహారాష్ట్ర ఎన్నికలు స్థానిక రైతులకు ఇబ్బందులను తెచ్చి పెట్టాయి.



ప్రదర్శనలు చేపట్టిన శ్రీ నయనం నృత్య కళా నిలయం చిన్నారులు

అయోధ్యలో అలరించిన నిర్మల్ కళాకారుల నృత్య ప్రదర్శనలు

భైంసా, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిర్మల్, భైంసాకు చెందిన పలువురు కళాకారులు అయోధ్యలో చేపట్టిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా అలరారించాయి. ఆదివారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో భారత్ ఆర్ట్స్ అకాడమీ రామ్ లాలా సంగీత నృత్యార్చన పేరిట కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భైంసాకు చెందిన డా. రంగు సౌమ్య సంపత్ సారధ్యంలోని శ్రీ నయనం నృత్య కళా నిలయానికి చెందిన 25 మంది కళాకారుల బృందం, మియపూరం శ్రీవాణి నేతృత్వంలోని శార్వాణీ సంగీత నృత్యానికేతన్‌కు చెందిన మరో కళాకారుల బృందం పాల్గొని నృత్య ప్రదర్శనలు చేపట్టింది. రెండు బృందాలకు చెందిన చిన్నారులు అద్భుతమైన తీరుతో చేపట్టిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. శార్వాణీ సంగీత నృత్యానికేతన్ శిక్షకురాలు మియపూరం శ్రీవాణి చేపట్టిన నృత్య ప్రదర్శన కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమ నిర్వాహకులు అద్భుతమైన నృత్య ప్రదర్శన చేపట్టిన చిన్నారులకు బాల రామ్ పురస్కారాన్ని అందచేసి సత్కరించింది. వీరితోపాటు శ్రీనయనం నృత్య కళా నిలయం శిక్షకురాలు డా.రంగు సౌమ్య సంపత్, శార్వాణీ సంగీత నృత్యానికేతన్ శిక్షకురాలు మియపూరం శ్రీవాణిలకు గురుసత్కారం కింద అయోధ్య రామ్ లాలా పురస్కారాన్ని అందచేసి ఘనంగా సత్కారం నిర్వహించారు.

కూచిపుడి ప్రదర్శననిచ్చిన నిర్మల్ విద్యార్థిని

నిర్మల్‌అర్బన్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భారత్ ఆర్ట్స్ అకాడమీ, రామ్‌లాల సంగీత నిత్యార్చన వారి ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో కూచిపూడి నృత్యప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. ఇక్కడికి దేశంలోని అన్ని రాష్ట్రాల వారు ఈ నృత్య ప్రదర్శనలో పాల్గొనడానికి వెళ్తుంటారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్మల్‌కు చెందిన సుంకరి ప్రమీల, మహేష్ దపంతుల కుమార్తె సహస్ర నాట్య గురువు నవ్య ఆధ్వర్యంలో పాల్గొని, ప్రతిభ చాటింది. సహస్ర జిల్లా కేంద్రంలోని వాసవి వరల్డ్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతుంది. సుమారు 1200 కిలో మీటర్ల దూరంలో ఉన్న అయోధ్యకు వెళ్లి తాను నృత్య ప్రదర్శన చేసి జిల్లాకు మంచి పేరు తెచ్చినందుకు పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబసభ్యులు ఎంతగానో గర్వపడ్డారు. ఈ సందర్భంగా ఆ చిన్నారికి రాముడు ప్రతిమను బహుమానంగా అందజేశారు.



ప్రదర్శనలు నిర్వహించిన శార్వణీ సంగీత నృత్యానికేతన్



కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న సహస్ర



బహుమతి అందుకున్న సహస్ర





నేరడిగొండ మండలంలో పెంచుతున్న పెరటికోళ్లు

లాభసాటిగా కోళ్ల పెంపకం

- గ్రామాల్లో పెరటి కోళ్ల పెంపకానికి పెరుగుతున్న ఆదరణ
- ఉపాధి మార్గంగా మలుచుకుంటున్న నిరుద్యోగ యువత

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పెరటి కోళ్ల పెంపకానికి ఇటీవల ఆదరణ పెరుగుతోంది. రైతులతో పాటు నిరుద్యోగ యువత సైతం ఈ రంగాన్ని ఉపాధి మార్గంగా మలుచుకుంటుంది. తక్కువపెట్టుబడితో పెంపకం చేపట్టే వీలుండడం, ఈ కోళ్లకు వ్యాధుల బెడద తక్కువగా ఉండడం, స్థానికంగా విక్రయించే సౌలభ్యం వంటివి ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. దీంతో ఈ రంగంవైపు యువత అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో పెరటి కోళ్ల పెంపకంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? పెంపకం చేపట్టే పెంపకందారులు ఎలాంటి మెళకువలు పాటించాలి? షెడ్డు నిర్మాణం ఏ విధంగా చేపట్టాలి? మేత అందించే విధానాలేమిటి తెలుసుకుందాం.



ఆరుబయట ఉన్న కోళ్లు

● పురాతన కాలం నుంచే..

నిజానికి పెరటి కోళ్ల పెంపకం గ్రామీణ భారత దేశంలో పురాతన కాలం నుంచి ఉంది. ఈ దేశీయ కోళ్ల నుంచి మాంసం, గుడ్ల ఉత్పత్తి తక్కువగా ఉండేది. ఒక్కో కోడి నుంచి యేడాదికి 70 నుంచి 80 గుడ్లను మాత్రమే ఉత్పత్తి చేస్తుంది. మెరుగైన కోళ్లతో పెంపకం చేపట్టి మాంసం, గుడ్ల ఉత్పత్తిని పెంచుకునే అవకాశం ఉంది. రైతుల సామాజిక, ఆర్థికస్థితిని మెరుగు పరచడానికి తక్కువ ప్రారంభం పెట్టుబడితో పెరటికోళ్ల పెంపకం చేపట్టవచ్చు.

● అనుకూల వాతావరణం..

పెరటి కోళ్లకు ఉండాల్సిన మేలైన లక్షణాల్లో ముఖ్యమైనది వాతావరణం. పెంపకానికి ఎంచుకునే కోళ్లు స్థానిక వాతావరణానికి అనువుగా ఉండేలా చూసుకోవాలి. మంచి సంతానోత్పత్తి సామర్థ్యం కలిగి ఉండడంతోపాటు మేలైనా శరీరాకృతి ఉండే పెరటికోళ్లనే పెంపకానికి ఎన్నుకోవాలి. రంగురంగుల ఈకలతో ఆకర్షణీయంగా ఉండడంతోపాటు ఇతర జంతువుల నుంచి తప్పించుకునే సామర్థ్యం కలిగిఉండాలి. ముఖ్యంగా వ్యాధి నిరోధక శక్తి ఉండేలా చూసుకోవాలి. గ్రామప్రియ, వనరాజ, గిరిరాజ, గిరిరాణి, కృష్ణ - జె తదితర కోళ్లను పెంచుకోవచ్చు. గ్రామప్రియ, వనరాజ కోళ్ల వార్షిక గుడ్ల ఉత్పత్తి సామర్థ్యం 100 నుంచి 150. పోషకాహారం, ఇతర నిర్వహణ పరిస్థితులను బట్టి 200 నుంచి 230రోజులకు గుడ్లు పెడుతోంది. గుడ్లు బరువు 55నుంచి 60 గ్రాముల వరకు ఉంటుంది. పరిపక్వ శరీర బరువు 2.5 నుంచి 3.5 కిలోలు ఉంటుంది.

● జాగ్రత్తలు పాటిస్తే చాలు

పెరటి కోళ్ల పెంపకానికి విస్తృతమైన షెడ్ల నిర్మాణం అవసరం లేదు. ఎండా, వాన, జంతువుల నుంచి రక్షణ కల్పించేలా వసతి ఏర్పాటు చేయాలి. పగటి పూట ఆహారం కోసం వదిలి, రాత్రిపూట షెడ్‌లోకి వదలాలి. షెడ్‌ను తూర్పు పడమర దిశలో నిర్మించాలి. వేసవిలో షెడ్‌లోకి సూర్యకాంతి పడకుండా చూడాలి. కలప, వెదురు, గడ్డి వంటి తక్కువ ఖర్చయ్యే వాటితో షెడ్ నిర్మాణం చేపట్టాలి. షెడ్ లోపల తేమలేకుండా చూడాలి. షెడ్‌ను ఎత్తయిన ప్రదేశంలో లేదా నేలమట్టానికి కనీసం 2 అడుగుల పైన ఉండేలా నిర్మించాలి. షెడ్ సులభంగా శుభ్రం చేసేలా ఉండాలి.

● సహజ, కృత్రిమ సంతానోత్పత్తి

పెరటి కోళ్ల పెంపకం కోసం సహజ సంతానోత్పత్తి లేదా కృత్రిమ సంతానోత్పత్తిని అవలంబించవచ్చు. సహజ సంతానోత్పత్తికి స్థానిక కోడిని ఉపయోగిస్తారు. ఒక కోడి 12 నుంచి 15 కోడి పిల్లలను పొదుగుతుంది. పొదిగిన తర్వాత కోడిపిల్లలను తల్లితో పాటు బయటకు వదులుతారు. రాత్రిపూట చిన్న కోడి పిల్లలు, తల్లి కోసం షెడ్ లోపల ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలి. కృత్రిమ బ్రూడింగ్‌లో ఆర్టిఫిషియల్ వేడిని అందిస్తారు. మొదటివారంలో 95 డిగ్రీల ఫారన్ హీట్, తర్వాత 70 డిగ్రీల ఫారన్‌హీట్ వచ్చే వరకు వారానికి 5 డిగ్రీల ఫారన్ హీట్ ఉష్ణోగ్రత చొప్పున తగ్గించవచ్చు. బ్రూడర్ హౌస్‌లో 6 వారాల వరకు రెండు వాట్ల ఉష్ణోగ్రత అవసరం. బ్రూడర్‌హౌజ్‌లో గరిష్ట పెరుగుదల కోసం ఫీడ్ వినియోగాన్ని పెంచాలి. ప్రారంభంలో బ్రూడర్ హౌస్‌లో కనీసం 48 గంటల వరకు నిరంతరం కాంతి ఉండేలా చూడాలి. పెరుగుతున్న దశలో అంటే 8నుంచి 18 వారాలు 10 నుంచి 12 గంటల పాటు కాంతి ఉండాలి.

మొత్తం వ్యయంలో 70శాతం మేతకు ఖర్చు

పౌల్ట్రీ ఉత్పత్తిలో మొత్తం వ్యయంలో 70శాతం మేతకు ఖర్చవు తోంది. కానీ పెరటి కోళ్ల పెంపకంలో దాణా ఖర్చు తక్కువగా ఉంటుంది. ఈ కోళ్లను మేత కోసం ఆరుబయట వదులుతారు. ఇవి కీటకాలు, నత్తలు, చెదపురుగులు, గడ్డి, కలుపు మొక్కల విత్తనాలు, మిగిలిపోయిన ధాన్యాలు, పంట అవశేషాలు, గృహ వ్యర్థాల నుంచి అవసరమైన ప్రొటీన్, శక్తి, ఖనిజాలు, విటమిన్లు మొదలైన వాటిని పొందుతాయి. వర్షాకాలంలో దాణాలో ఫంగల్ పెరుగుదలను నివారించడానికి నెలన్నర కంటే ఎక్కువ నిల్వ చేయకూడదు. సాధారణంగా పెరిటికోళ్ల పెంపకంలో రెండు సార్లు ఉదయం, సాయంత్రం దాణాను అందిస్తారు. మొక్కజొన్న, వరి తవుడు, గోధుమ ఊక, వేరుశనగ పిట్టు, స్థానికంగా లభించే పదార్థాలతో తయారు చేయవచ్చు. కోళ్ల దాణాలో స్టార్టర్ లెవల్‌లో కనీసం 20శాతం గ్రోవర్‌లో 16 శాతం మాంసకృతులు ఉండాలి.

● సరైన సమయంలో టీకాలు వేయాలి

పెరటి కోళ్ల పెంపకంలో మెరుగైన ఆరోగ్య సంరక్షణ కోసం కోళ్లకు సకాలంలో వైరస్ వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలి. కోళ్ల వయస్సును బట్టి టీకాలివ్వాలి. ఒక రోజు వయసు కోడి పిల్లలకు మారెక్స్ వ్యాధికి, 4నుంచి 7రోజులు వయస్సు, 14నుంచి 18రోజుల ప్పుడు, 35 రోజుల దశలో, 6 నుంచి 7 వారాలప్పుడు, 8 నుంచి 10 వారాలప్పుడు డాక్టర్ సలహా మేరకు టీకాలివ్వాలి.

పెరటి కోళ్లతో ఉపాధి

● కోవ రమేష్ (పెంపకందారుడు)

పెరటి కోళ్ల పెంపకం గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల ఆదరణ పెరుగుతోంది. దీంతో మాకు జీవనోపాధి దొరుకుతోంది. పెరటి కోళ్ల పెంపకంలో దాణా అయ్యే ఖర్చు తక్కువగానే ఉంటుంది. అందుకే ఇంటి వద్దనే చిన్న షెడ్డు ఏర్పాటు చేసుకుని వీటిని పెంచడం చాలా సులువుగా ఉంటుంది. కోళ్ల పెంపకంతో జరిగే వ్యాపారం లాభసాటిగానే ఉంది.



- ఇంద్రవెల్లిలో ఇంటి వద్దనే పెంచుతున్న పెరటి కోళ్లు



- కోళ్లకు దాణా వేస్తున్న దృశ్యం

ముథోల్‌లో నేటి నుంచి గురుకులాల
10వ జోనల్ క్రీడలు ప్రారంభం

- పాల్గొననున్న ఐదు జిల్లాల్లోని 1020 మంది క్రీడాకారులు



క్రీడలు నిర్వహించే మైదానం ఇదే..



ముథోల్ గురుకుల పాఠశాల

ముథోల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గ కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల కళాశాలలో బాలుర విభాగంలో 10వ జోనల్ స్థాయి క్రీడలను పటిష్టంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి క్రీడలకు సర్వం సిద్ధం చేసినట్లు జోనల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎం. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సి. నరసింహ రెడ్డి, ఆర్గనైజర్ సెక్రటరీ నిరంజన్‌లు తెలిపారు. ఆదివారం ముథోల్ రెసిడెన్షియల్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించే 10వ జోనల్ క్రీడల ఏర్పాట్ల గురించి నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. సోమవారం నుంచి 14 వరకు ముథోల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా మైదానంలో 10వ జోనల్ స్థాయి బాలుర విభాగంలో అండర్- 14, 17, 19 స్థాయిల్లో వాలీ బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారం, వాల్ బ్యాట్‌మెంటర్, హ్యాండ్ బాల్, టెన్నికైట్స్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లోని 12 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల నుంచి సుమారు పాఠశాల నుంచి 85 మంది విద్యార్థుల చొప్పున మొత్తం 1020 మంది క్రీడాకారులు, 300 మంది సిబ్బంది, 5మంది పీడీలు, 18 మంది పీఈటీలు పాల్గొంటారని తెలిపారు. క్రీడల నిర్వహణకు 17 కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. క్రీడల ప్రారంభోత్సవానికి ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో పాటు ఎమ్మెల్సీ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ పూర్తి ఏర్పాట్లను బాసర జోన్ జోనల్ ఆఫీసర్ పీఆర్ ఫ్లోరెన్స్ రాణి, డీసీవో ప్రశాంతిల పర్యవేక్షణలో క్రీడలు జరుగనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ నరసింహ రెడ్డి, వెంకటేశ్వర్, బాబు, సత్యనారాయణ, లక్ష్మణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడలకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్, ఇతర అధికారులు





అర్లి(టి)రాముల గుట్ట వద్ద విగ్రహాలతో గిరి ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



● ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో ఎత్తివేసిన మైనర్ ఇరిగేషన్ కార్యాలయం

పలు కార్యాలయాల.. ఎత్తివేత!

- ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చారు.. తెలంగాణ రాష్ట్రం వచ్చాక తొలగించారు
- ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో ఒక్కొక్కటిగా కార్యాలయాలు మాయం!!
- ముందుగా ఇరిగేషన్ కార్యాలయం ఎత్తివేత.. ఆ తర్వాత ఏడీఏ ఆఫీస్
- సబ్ డిపోగా మారిన ఉట్నూర్‌లోని ఆర్టీసీ డిపో
- ఏజెన్సీ ప్రాంత ప్రజలకు తప్పని తిప్పలు

ఉట్నూర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందుబాటులో ఉంచాలని ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు ఇచ్చిన కార్యాలయాలను తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక అందుబాటులో లేకుండా పాలకులు చేశారని ఖానాపూర్ నియోజకవర్గం ప్రజలు విమర్శిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు కేంద్ర బిందువైన ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను ఒక్కొకటిగా ఎత్తివేశారు. కార్యాలయాలు ఎత్తివేస్తున్న అప్పుడున్న పాల కులు, ప్రజాప్రతిధులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలు దూరం అయ్యాయి. ఫలితంగా ప్రజలకు బాధలు తప్పడం లేదంటున్నారు.

తప్పని సాగునీటి ఇక్కట్లు

ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయానికి అనుబంధంగా ఉన్న చిన్న తరహా నీటిపారుదల శాఖ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్రం వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తివేసింది. ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల రైతులకు ప్రజలకు సాగునీటి వనరులను అందుబాటులో తేవడానికి ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్యాలయం ద్వారా గిరిజన ప్రాంతాల్లోని బీడు భూములకు సాగునీరు అందించడానికి చెరువులు, కుంటలు, చెక్ డ్యాములు, ఎత్తిపోతల పథకాలు చాలా చోట్ల నిర్మించారు. బీడు భూములకు తాగునీరు అందించుకునే విధంగా గిరిజన రైతులకు ప్రయోజనం కలిగించిన చిన్న తరహా నీటిపారుదల శాఖ కార్యాలయాన్ని





ఉట్నూర్‌లో ఎత్తివేసిన ఏడీఏ కార్యాలయం



ఉట్నూర్ మండలకేంద్రంలోని ఆర్టీసీ డిపో

బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఎత్తి వేయడంతో గిరిజన ప్రాంతాల ప్రజలకు సాగునీటి వనరులు అందకుండా పోతున్నాయంటున్నారు. అంతేకాకుండా కార్యాలయం ఎత్తి వేయడంతో ప్రస్తుతం ఐటీడీఏ మైనర్ ఇరిగేషన్ శాఖ కార్యాలయ భవనం శిథిల దశకు చేరుకుంది.

శిథిలావస్థలో ఏడీఏ కార్యలయం

ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలోని రైతులకు వ్యవసాయ సూచనలు సహకారం అందించే వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయాన్ని పదేళ్ల క్రితం ఎత్తివేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిన కార్యాలయాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎత్తివేసి నియోజకవర్గాలకు ఈ కార్యాలయాలను మార్చింది. ఫలితంగా ఉట్నూర్‌లో ఉన్న కార్యాలయాన్ని బోథ్ నియోజక వర్గానికి మార్చి ఇచ్చోడలో ఏర్పాటు చేశారు. ఖానాపూర్ నియోజకవర్గంలో ఉన్న ఉట్నూర్ ప్రాంత రైతులకు ఇచ్చోడ ఏడీఏ కార్యాలయాన్ని అందు బాటులోకి తేవడంతో ఈ ప్రాంత రైతులు ఉన్నతాధికారుల ద్వారా తమ కార్యాలయాన్ని ఇక్కడికి మార్చాలని కోరడంతో.. కేవలం అధికారులను మాత్రం ఇచ్చినా.. ప్రభుత్వం ఆ అధికారికి అధికారాలు ఇవ్వలేకపోవడం గమనార్హం. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఏడీఏ కార్యాలయం భవనం శిథిల దశకు చేరుకుంది. ప్రస్తుతం ఏడీఏ ఇన్‌చార్జీగా ఉన్న అధికారి కేవలం కాగి తాలకే పరిమితం కాగా.. ఇచ్చోడ ఏడీఏకి పూర్తి అధికారాలు కొనసాగిస్తున్నారు.

ప్రారంభంలో 43 సర్వీసులు

1996లో ఉమ్మడి రాష్ట్రంలో ఉట్నూర్ డిపో ఏర్పాటు చేసి ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు అందుబాటులోకి కృషి చేశారు. డిపో ప్రారంభంలో 43 సర్వీసులు ఏర్పాటు చేసి డిపో మేనేజర్‌తో పాటు డిపోకు కావాల్సిన అన్ని హంగులను ఏర్పాటు చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక.. డిపోను సబ్ డిపోగా మార్చేసి ఆదిలాబాద్ డిపో మేనేజర్‌ను ఇన్‌చార్జీగా కొనసాగిస్తూ.. డిపోను నిర్వీర్యం చేస్తూ వచ్చారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధుల సైతం ఏమాత్రం పట్టించుకోక పోవడంతో ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆడింది ఆట పాడింది పాటగా బస్సుల సంఖ్యను తగ్గించారు. దీంతో ఏజెన్సీ ప్రాంతాల గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు అందని ద్రాక్షగా మారుతున్నాయంటున్నారు. ఉట్నూర్‌లోని డిపోను

(...తరువాయి 6వ పేజీలో)

అర్లి(టి) రాములగుట్ట వద్ద గిరి ప్రదక్షిణలు

భీంపూర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్లి(టి) శివారు ప్రాంతంలో గుట్టపై ఉన్న రామాలయం వద్ద ఆదివారం చాతుర్మాసం పురస్కరించుకుని శ్రీరామ, లక్ష్మణ, సీతా, హన్మంతుల విగ్రహాలతో అర్లి(టి) గ్రామస్తులు గిరి ప్రదక్షిణలు నిర్వహించారు. అలాగే ఈనెల 13వ తేదీన వాదుర్ పెన్ గంగలో చక్ర స్నానాలు ఆచరించి పూజలు చేస్తామని గ్రామ పెద్దలు గొల్లి లస్మన్న, రుద్ర గంగన్న, అంకం అశోక్, బొంత నితిన్, హరి, కృష్ణలు తెలిపారు.

నేటి నుంచి ప్రైవేట్ పత్తి కొనుగోళ్లు బంద్

● కఠిన నిబంధనల పేరిట సీసీఐ ఇబ్బందులు

● కాటన్ జిన్నింగ్ అండ్ ప్రాసింగ్ ఇండస్ట్రీస్ నిర్ణయం

ఆదిలాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పత్తి కొనుగోళ్లను నిరవధికంగా నిలిపి వేస్తున్నట్లు కాటన్‌జిన్నింగ్ అండ్ ప్రెసింగ్ ఇండస్ట్రీస్ యజమానులు ప్రకటించారు. సీసీఐ కొనుగోళ్లలోఎల్ 1, ఎ ల్2, ఎల్ 3 పేరుతో జిన్నింగ్ వ్యాపారులను కఠిన నిబంధనల పేరుతో రైతులను పత్తి ఖరీదులో ఇబ్బందులకు గురి చేస్తున్నందున నవంబరు 11 సోమవారం నుంచి సీసీఐ, ప్రైవేట్ పత్తి కొనుగోళ్లను నిరవధికంగా నిలిపి వేస్తున్నట్లు నిర్ణయించారు. కాటన్ జిన్నింగ్ అండ్ ప్రాసింగ్ ఇండస్ట్రీస్ యజమానులు సహకరించాలని కోరారు. తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు బోథ్ ఎమ్మెల్యే పర్యటన

సిరికొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలంలో ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఒరగంటి పెంటన్న ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నేరడిగొండ(జి), నేరడిగొండ(కే), నారాయణ్‌పూర్, జెండాగూడ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వారు తెలిపారు.

లంబాడాలకు ఎస్టీ హోదా రద్దు చేయాలి

● ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్

ఉట్నూర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని లంబాడాలకు ఎస్టీ హోదా రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు డిమాండ్ చేశారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆదివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో జీవో 3ను చట్టం చేయాలని, ఇంటి ఇంటి సర్వేని ఏజెన్సీలో రద్దు చేయాలని, జీవో 33ని ఏజెన్సీలో అమలు చేయరాదని తీర్మానాలు చేసినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అడ్వాయిజరీ నాయకులు కేవిరావు, నాయకులు జాతీయ అధ్యక్షులు దాట్ల నాగేశ్వరరావు, ఉయికె శంకర్, చంద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నైతంబాలు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామరాజు, జాయింట్ సెక్రటీ ఈసాల సురేష్, ఆడ శంకర్, ఆడ నర్సింగరావు, జిల్లా క్రిస్టల్ ప్రధాన కార్యదర్శులు మనోహర్, జిల్లా అధ్యక్షుడు, సెడ్మకి భీంరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు : ఎంపీ నగేష్

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థి భవిష్యత్తు, జాతి నిర్మాణం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని ఎంపీ గోడం నగేష్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) 6వ విద్య మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పై అసెంబ్లీలో చర్చిస్తానన్నారు. ఈ సందర్భంగా సంఘానికి సేవలు అందించిన పలువురు ఉపాధ్యాయులను ఎంపీ, ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు తుమ్మ లచ్చిరాం, పి.రఘునందన్‌రెడ్డి, నాయకులు బేర దేవన్న, ఎ.మురళీ మనోహర్‌రెడ్డి, మొగులయ్య, మల్లారెడ్డి, కైలాసం, తొడిశెట్టి రవికాంత్, తదితరులు పాల్గొన్నారు.

లాభసాటిగా కోళ్ల పెంపకం



● గ్రామాల్లో పెరటి కోళ్ల పెంపకానికి ఆదరణ
● ఉపాధి మార్గంగా మల్చుకుంటున్న నిరుద్యోగ యువత

వివరాలు 7వ పేజీలో...

తప్పులు లేకుండా సమగ్ర సర్వే చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా ● బోథ్‌లోని పలు కాలనీల్లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణ తీరు పరిశీలన ● కౌటా(బి) గ్రామంలో ఓటరు నమోదు కేంద్రం సందర్శన.. వివరాల సేకరణ

బోథ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా(బి), బోథ్‌లలో ఆదివారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా సమగ్ర కుటుంబ సమగ్ర సర్వేను పరిశీలించారు. గ్రామంలోని ముదిరాజ్ కాలనీ బోథ్ మండల కేంద్రంలోని శంకర్‌రావు కాలనీలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను పరిశీలించి నమోదు ప్రక్రియ ఎలా జరుగుతుందనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్వే బృందానికి పలు సూచనలు చేశారు. అనుమానం ఉన్న వాటిని నివృత్తి చేశారు. ఒకే కుటుంబంలో ఎవరెవరి పేరున నమోదు చేయాలన్నారు. ప్రతి కాలంలో కుటుంబీకులను అడిగి పూర్తి చేయాలన్నారు. సర్వేలో ఎలాంటి త ప్పులు లేకుండా చూడాలని సూచించారు. సమగ్ర సర్వే భవిష్యత్తుకు అవసరం ఉన్నందున ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సుభాష్ చంద్ర, ఎంపీడీవో రమేష్, ప్రత్యేక అధికారి వాజీద్ అలీ, గ్రామ వీడీసీ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, యువకులు ఉన్నారు. సమగ్ర సర్వే జరుగుతున్నందున గ్రామ యువకులు సహకరించాలని సూచించారు.



బోథ్‌లో సర్వే నమోదు పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్



కౌటా(బి) ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తూ..

● ఓటరు నమోదు పూర్తి వివరాలు సేకరించాలి

బోథ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా(బి) గ్రామంలో ఆదివారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా నమోదవుతున్న ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఓటరుగా నమోదు అయ్యే వారి వివరాలు అడిగి తెలుసుకోవాలని సూచించారు. గతంలో ఎక్కడైనా ఓటరుగా నమోదు అయి ఉంటే ఓటరు ఐడీ కార్డును డిలీట్ చేయాలన్నారు. వేరే గ్రామాల నుంచి వచ్చి ఓటరుగా నమోదు కావడానికి దరఖాస్తు చేసుకుంటే గతంలో వారికి ఓటు హక్కు ఉందా అనే విషయాన్ని పరిశీలించాలని సూచించారు. చనిపోయిన వారి పేర్లను తొలగించాలని సూచించారు. అన్ని వివరాలను పరిశీలించి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అంతేగాక, గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న వారు చనిపోతే వారి పేర్లను తొలగించాలని ఎన్యూమరేటర్‌పైన అంగన్‌వాడీ కార్యకర్త అనితకు సూచించడం జరిగింది. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ సుభాష్ చంద్ర, ఎంపీడీవో రమేష్, ప్రత్యేక అధికారి వాజీద్ అలీ, ఎంపీఈవో జీవన్‌రెడ్డితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సమగ్ర కుటుంబ సర్వే సూపర్ వైజర్ కల్యాణ్‌తో పాటు ఎస్ఐ ప్రవీణ్, వీడీసీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సి.రవీందర్, నాయకులు అశోక్‌రెడ్డి, గాజుల సురేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న గ్రామస్థులు

ఏఎన్ఎం స్థానికంగా ఉండేలా చూడాలి

● కలెక్టర్‌కు విన్నవించిన గ్రామస్థులు

బోథ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా(బి) గ్రామంలో ఏఎన్ఎం స్థానికంగా ఉండే విధంగా చూడాలని కౌటా(బి) గ్రామానికి చెందిన మాజీ వీడీసీ అధ్యక్షుడు గాజుల సురేందర్ కలెక్టర్‌కు సూచించారు. గతంలో ఏఎన్ఎం స్థానికంగా ఉండేదని అయితే నూతనంగా వచ్చిన ఏఎన్ఎం కేవలం బుధవారం మాత్రమే వచ్చి చిన్న పిల్లలకు టీకాలు వేస్తుందన్నారు. అయితే అత్యవసర పరిస్థితుల్లో ఏఎన్ఎం లేకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బదులు కలుగుతున్నాయన్నారు. సబ్ సెంటర్ పరిధిలో ఎనిమిది గ్రామాలు ఉన్నాయని వారికి సరైన ప్రాథమిక వైద్యం అందాలంటే ఏఎన్ఎం ఇక్కడే ఉండే విధంగా చూడాలని కోరారు. అంతేగాక గ్రామంలో పాఠశాల నిర్మాణం అర్ధాంతరంగా ఉందని పాఠశాల పూర్తయ్యే విధంగా చూడాలని కోరారు. గ్రామంలోని ప్రధాన రోడ్డు గుంతల మయంగా మారిందని రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విన్నవించారు. ఈజీఎస్ కింద రోడ్డు మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ గ్రామస్థులకు తెలిపారు. పాఠశాల పూర్తి చేసేందుకు ప్రస్తుతం నిధులు లేవని నిధులు రాగానే పనులు పూర్తయ్యే విధంగా చూడటం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామానికి చెందని వీడీసీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, యువజన సంఘం సభ్యులు వెండి సోమేశ్వర్, మాజీ ఉప సర్పంచ్ సి.రవీందర్‌తో పాటు పలువురు కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు.

● పల్లె దవాఖానా ఏర్పాటు చేస్తాం : కలెక్టర్

బోథ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా(బి) గ్రామంలో పల్లె దవాఖాన ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ఏఎన్ఎం ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్తుల ఫిర్యాదుతో జిల్లా వైద్యాధికారితో కలెక్టర్ మాట్లాడటం జరిగింది. తక్షణమే గ్రామంలో పల్ల దవాఖాన ఏర్పాటు విషయమై చర్యలు తీసుకోవాలని ఇక్కడే ఉండే విధంగా చూడాలని జిల్లా వైద్యాధికారి ఆదేశించారు.

ఆదివాసీ బిడ్డలకు విద్యను అందించరా? : తుడుందెబ్బ



మాట్లాడుతున్న తుడుందెబ్బ జిల్లా నాయకులు

నార్నూర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) ఏజెన్సీ ప్రాంత గాదిగూడ మండలంలోని పూనగూడ రూప్సాపూర్, శివనారా అల్లిగూడ సెడ్వాయి, కొలమ మారేగావ్, హీరాపూర్, వర్కవాయి, చిన్నకుండి, కొత్తపల్లి(జి) గ్రామాలకు ఉపాధ్యాయులు లేక విద్యకు దూరమవుతున్న ఆదివాసీ బిడ్డలకు విద్యను అందించరా? అని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు, రాయిసెంటర్ సార్‌మేడి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మేస్రం దురుగు పటేల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం ఆదివాసీ నాయకులు గాదిగూడ మండలంలో సుడిగాలి పర్యటన చేసి ఆయా ప్రాంత స్థితిగతులు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ఉన్న చోట పాఠశాల, అంగన్వాడీ భవనాలు లేవు ఇంత నిర్లక్ష్యంగా విద్య వ్యవస్థ ఉంటే మా గిరిజన పిల్లలు ఎలా బాగుపడతారని మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతం ఐటీడీఏ ఉన్న అధికారుల నిర్లక్ష్యంతో మా బ్రతుకులకు లేకుండా పోయిందని ఆరోపించారు. వెంటనే ఈ ప్రాంతానికి జిల్లా కలెక్టర్ పీఓ పర్యటించి ఇక్కడున్న వాస్తవాలను గుర్తించి ప్రాంత ప్రజలకు న్యాయంచేయాలని వారు డిమాండ్‌చేశారు. సంబంధిత అంశాల పై రాష్ట్ర ముఖ్యమంత్రి తెలియపరుస్తామని వారు పేర్కొన్నారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు పూర్తయిన ఆదివాసుల పై ఇప్పటికి ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నారని ఆదివాసీ గిరిజన విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం బాగు చేసే దిశగా ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. వారి వెంట నాయకులు డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి పేరుసంతోష్, గ్రామప్రజలు, తదితరులు ఉన్నారు.